

శ్రీ రోశయ్యగారి నేతృత్వములో జె.కె.సి. కళాశాల
ఆదర్శమైన కళాశాలగా రూపొందినది

# పరిపాలనాదక్షుడు
# శ్రీ ఎలవర్తి రోశయ్య


శ్రీ గోగినేని శ్రీమన్నారాయణ
రిటైర్డు ప్రిన్సిపాల్, నిడుబ్రోలు


స్వరాజ్యము రాకపూర్వము ఆంధ్రదేశములో ఆంగ్ల కళాశాలలు చాల కొద్ది, కమ్మవారిలో విశ్వ విద్యాలయ విద్యనార్జించిన వారు చాలా అరుదు. హూణవిద్యలో, ఎం.ఏ. పట్టము తీసుకొని అధ్యాపక వృత్తిలో ప్రవేశించిన కమ్మ వారిని వ్రేళ్లమీద లెక్కింపవచ్చు.

శ్రీ ఎలవర్తి రోశయ్యగారు విశ్వ విద్యాలయపు చదువు ముగించుకొని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో ఆచార్య పదవి నలంకరించుట ఆంధ్రదేశ సాంఘిక చరిత్రలో ఒక ప్రధానాంశముగా పరిగణింపవచ్చు. కమ్మ వారిలో గుంటూరు ఆంధ్ర విశ్వవిద్యాలయ-అనుబంధ కళాశాలలలో ఆచార్య పదవియందు చేరిన మొదటి కమ్మకులస్థుడు శ్రీ రోశయ్యగారే కావచ్చు.

శ్రీ రోశయ్యగారు ఆంగ్ల భాషాచార్యుడుగా ప్రసిద్ధిచెందినారు. పండితుడుగా గుర్తింపబడినారు. ఆంగ్ల సాహిత్యము కూలంకషముగా

అవలోకనము చేసినవారని ప్రశస్తి. ఆంగ్ల భాషలో నిర్దుష్టమైన ఉచ్చారణలో ఆయనకాయనే సాటి.

ఆంగ్ల భాషాచార్యులయిన శ్రీ రోశయ్యగారు తెలుగులోగూడ గొప్పపండితుడుగా, విమర్శకుడుగా పేరుగాంచినారు. చిన్నయసూరి వారికి అభిమాన రచయిత, బాల వ్యాకరణములో అనేక క్లిష్ట సూత్రములను విశదీకరించుట వలనకాబోలు ఆయన వ్యాకరణ పండితుడుగా పరిగణనలోనికి వచ్చినారు. కొందరు గొప్పకవులు, పండితులుకూడ తాము రచించిన గ్రంథముల వ్రాత ప్రతులను శ్రీ రోశయ్యగారికి చూపెట్టిగాని అచ్చువేయించెడివారుకాదు.

శ్రీ రోశయ్యగారు ఆచార్యుడుగా మంచి పేరు ప్రతిష్ఠలు తెచ్చుకొన్నారు. విద్యార్థులను ప్రేమించుటవారి ప్రత్యేకత. ఎందరో విద్యార్థులు ఆయనగారి ప్రేరణతో పై చదువులు చదివి పెద్ద పదవుల నలంకరించిరి. ఆయనగారి యొద్ద చదువుకొన్నవారు, సలహాలు తీసుకొన్నవారు ఎందరో వారిని శ్లాఘింతురు, గౌరవింతురు, పూజింతురుగూడ.

గుంటూరులో శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాలను స్థాపించి శ్రీ ఎలవర్తి రోశయ్యగారిని కళాశాలాధ్యక్షులు (ప్రిన్సిపాలు)గా నియమించిన కళాశాల కమిటీవారి-ముఖ్యముగా అప్పటి పాలక వర్గ కార్యదర్శి డాక్టరు కాసరనేని సదాశివరావుగారి-ముందుచూపు ఎంతయో శ్లాఘనీయము. కళాశాలాధ్యక్షుడుగా ప్రవేశించిన అనతి కాలములోనే పరిపాలనదక్షుడుగా, విద్యావేత్తగా ప్రకాశింపగలిగినారు. వారిపేరు ప్రతిష్ఠలు కాలేజికెంతో ఉపకరించినవి. విద్యార్థుల కోసము వెదకవలసిన అవసరము లేక పోయినది. చక్కని విద్యాబోధన, మంచి పరీక్షా ఫలితాలు, అన్నిటినిమించి జె.కె.సి. కళాశాల చక్కని క్రమశిక్షణకు నిలయమైనది. శ్రీ రోశయ్యగారి నేతృత్వములో జె.కె.సి. కళాశాల ఆదర్శమైన కళాశాలగా రూపొందినది.

శ్రీ రోశయ్యగారు లౌకికుడు కాడని లోకప్రతీతి. నిర్మొగమాటి, ఉన్నదున్నట్లు మాటలాడెడి స్వభావము గలవారు. విధినిర్వహణలో అప్రమత్తుడై ఉండుచు ఇతరులు గూడ అలాగుననే యుండవలెనని శాసించుటకు ప్రయత్నించి చాల విమర్శలకు గురయిన వారు శ్రీ రోశయ్యగారు.

భాషావిషయములో ఆయన రాజీపడలేదు. శుద్ధగ్రాంథికవాది, ఏకొంచెపు పొరపాటును కూడ సహింపలేరు. ఆయనగారు ప్రిన్సిపాలుగా ఉన్న రోజులలో కళాశాలాధ్యాపకులు సైతము ఒకటి రెండుసారులు సరిచూచుకొని గాని సెలవు చీట్లు పంపెడివారు కారట. ఆయనగారి పేరును గురించి కూడ ఒక ప్రథ కలదు. ఎవరయినను ''ఏమండి రోశయ్య గారూ బాగున్నారా'' అన్నప్పుడు ''రోశయ్య, కాదయ్యా, 'రోసయ్య' నాపేరు'' అని చెప్పుచు అక్కడ కక్కడే తప్పుదిద్దెడువారట. ఇట్టివి ఎన్నో కథలున్నవి. వారిని గురించి. ఈ వ్యాసము ప్రచురించినచో, వారు చూచుట తటస్థించినచో, ఎన్నిమాట్లు ఎఱ్ఱ కలము ఉపయోగింతురో.

కళాశాలలో పనిచేసినంత కాలము శ్రీ రోశయ్యగారు సూటులో తప్ప కాలేజికి వెళ్లెడివారు కాదట. చక్కని రూపము, ఆకర్షకమైన వేషము, వంకరలేని ప్రవర్తన, ఆడంబరములేని ఆదరణ, కఠినమైన ఆచరణనియమావళి, ఆయన కొక విశిష్టమైన వ్యక్తిత్వమును చేకూర్చినవి.

గుంటూరు కమ్మ హాస్టల్‌కు ఒక ప్రత్యేక చరిత్ర ఉన్నది. కమ్మ యువకు లెందరో కమ్మ హాస్టలులో నుండి, ఏ.సి. కాలేజిలో చదువుకొని ఉన్నత పదవులలో భాసించిరి. ఆవసతి గృహములో వారి శీల సంపద పెంపొందుచుండెడిది. శ్రీ రోశయ్యగారు చాలకాలము ఆ హాస్టలు వార్డెనుగా పని చేసిరి. ఎన్నో కష్టనష్టాలు భరించి అహర్నిశలు శ్రమించి హాస్టలు విద్యార్థులకు ఎంతో సేవ చేసిరని శ్రీ రోశయ్యగారిని గురించి చెప్పుకొందురు. అందువల్ల కాబోలు ఈయనగారికి కులాభిమానము మెండని మెచ్చుకొనువారు కొందరు. విమర్శించెడివారు మరికొందరు.